న్యూస్‌రీల్

సుబ్బారాయుడి సేవలో ఐఏఎస్ అధికారి చిన్నరాముడు



మోపిదేవి: స్థానిక శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారిని ఐఏఎస్ అధికారి బి.చిన్నరాముడు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. మంగళవారం ఉదయం ఆలయానికి చేరుకున్న ఆయనను ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తొలుత ఆలయ ప్రదక్షిణ అనంతరం నాగపుట్టలో పాలు పోసి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు బుద్దు సతీష్‌శర్మ, మణిదీప్ శర్మ స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ అచ్యుత మధుసూదనరావు స్వామివారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం అందించారు.

ఆంజనేయస్వామికి 1,008 గారెలతో పూజ



మచిలీపట్నం టౌన్: నగరంలోని ఈడేపల్లిలో వేం చేసి ఉన్న శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం స్వామివారికి 1008 గారెలతో పూజ నిర్వహించారు. పూజ అనంతరం స్వామివారి ప్రసాదాన్ని భక్తులకు అందజేశారు. పూజకు ఉపయోగించిన గారెలను సమ్మెట నాగ వెంకట శివప్రసాద్, ఉయ్యూరు శ్రీనివాసరావు, తలకటూరి సీతారాముడు, బోయిన జగన్మోహనరావు, గొల్ల రవిచంద్రుడు, గుంటుపల్లి బాబురావు సమర్పించారు.

3 నుంచి డీఎస్సీ అభ్యర్థులకు ఇండక్షన్ శిక్షణ

మచిలీపట్నంఅర్బన్: ఉమ్మడి కృష్ణా జిల్లాకు సంబంధించిన మెగా డీఎస్సీ–2025లో ఎంపికైన 1,203 మంది అభ్యర్థులకు ఇండక్షన్ శిక్షణ కార్యక్రమం అక్టోబర్ 3 నుంచి 10వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు కృష్ణా జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే రామారావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమకు కేటాయించిన కేంద్రాల్లో తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. కేంద్రాల వారీగా స్కూల్ అసిస్టెంట్లు(తెలుగు, హిందీ, ఆంగ్లం, సంస్కృతం, ఉర్దూ, బయోసైన్స్, గణితం, ఫిజికల్ సైన్స్), ఎస్జీటీ(ఉర్దూ) విభాగాల్లో ఎంపికైన 945 మంది అభ్యర్థులకు శిక్షణ కృష్ణా జిల్లా పామర్రులోని ప్రగతి ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్లలో ఏర్పాటు చేశారని తెలిపారు. అలాగే స్కూల్ అసిస్టెంట్లు(సామాజికం, ఫిజికల్ ఎడ్యుకేషన్) విభాగాల్లో ఎంపికైన 258 మంది అభ్యర్థులకు ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలంలోని వాహిని ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కేంద్రంగా జరుగుతుందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం ఎనిమిది రోజుల పాటు కొనసాగుతుందన్నారు. ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్లతో పాటు ఫార్మల్ డ్రెస్ కోడ్ తప్పనిసరిగా పాటించాలని చెప్పారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు



మచిలీపట్నంటౌన్: నగరంలోని 46వ డివిజన్ పంచాయతీరాజ్ కాలనీలో పార్కు వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లో మంగళవారం ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానిక యువకులు మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. ఆ తరువాత విద్యుత్‌శాఖ సిబ్బంది వచ్చి మరమ్మతు పనులు చేపట్టారు. ఇంటర్నల్ సమస్య కారణంగా మంటలు వ్యాపించాయని ఏఈ నవీన్‌రెడ్డి చెప్పారు. లోడ్ సర్దుబాటు చేసి సరఫరా పునరుద్ధించామని, త్వరలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తామన్నారు.

పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ



రావివారిపాలెం(మోపిదేవి): మండలంలోని రావివారిపాలెం పాలకేంద్రం వద్ద పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం ఆధ్వర్యంలో రూ.1.75 లక్షల బోనస్‌ను రైతులకు పంపిణీ చేశారు. పాలకేంద్రం వద్ద అధ్యక్షుడు రావి లక్ష్మణరావు అధ్యక్షతన మంగళవారం బోనస్, ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అనంతరం పాల కేంద్రం ఆధ్వర్యంలో రూ.80 వేలతో 20 సిమెంట్ బల్లలు అందించారు. పశువుల వైద్యానికి వీలుగా మూడు క్యాటిల్ క్రష్ ఏర్పాటు చేసినట్లు పాలకేంద్రం అధ్యక్షుడు లక్ష్మణరావు తెలిపారు. విజయ డెయిరీ మేనేజర్ గోపీనాథ్, పాలకేంద్రం మాజీ అధ్యక్షుడు గవిని శివరామకృష్ణ, రావి ప్రభుప్రసాద్(బుట్టో), వి.పిచ్చేశ్వరరావు, రామకృష్ణ, రామనాథం, బుల్లి, సురేష్ పాల్గొన్నారు.



చిన్న ఉల్లింగిపాలెంలో పుస్తకాలు అందజేస్తున్న పేర్ని కిట్టు, మాజీ మేయర్ మోక వెంకటేశ్వరమ్మ



శ్రీరామ పాదక్షేత్రంలో పూర్ణాహుతి చేస్తున్న పాతూరి దంపతులు



పెడన కన్యకాపరమేశ్వరి ఆలయంలో హోమం చేస్తున్న భక్తులు



ముంజులూరులో పూజలు చేస్తున్న భక్తులు



శ్రీదుర్గాదేవీగా పెడన పైడమ్మ అమ్మవారు

దుర్గాదేవీ మనసాస్మరామి..

మచిలీపట్నం, అవనిగడ్డ, పెడన నియోజకవర్గాల వ్యాప్తంగా దేవీ శరన్నవ రాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజైన మంగళవారం అమ్మవార్లు శ్రీదుర్గాదేవీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవార్లకు సామూహిక కుంకుమార్చనలు, హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాలకు చేరుకుని అమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నవితరణ చేపట్టారు. ఆలయ అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు, ఏర్పాట్లను పర్యవేక్షించారు.

– మచిలీపట్నంటౌన్/పెడన/అవనిగడ్డ/గూడూరు/చల్లపల్లి/ఘంటసాల/కోడూరు/మోపిదేవి/నాగాయలంక/బంటుమిల్లి/కృత్తివెన్ను



కృత్తివెన్ను శివాలయంలో దుర్గాదేవిగా..



రామన్నపేటలో దుర్గాదేవిగా..



దత్తాశ్రమంలో దుర్గాదేవిగా..



అవనిగడ్డ లంకమ్మ అమ్మవారి ఆలయంలో..



పెదకళ్లేపల్లిలో మహాదుర్గాదేవీ స్వరూపిణిగా.



గణపేశ్వరంలో శ్రీదుర్గాదేవి అలంకారంలో..



లక్ష్మీపురంలో దుర్గాదేవి అలంకరణ



దుర్గాదేవిగా దర్శనమిచ్చిన విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ



చిట్టూర్పులో దుర్గాదేవిగా..

ఆక్వా రంగంలోనూ తగ్గిన జీఎస్టీ



ఆక్వా రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెడన: ప్రస్తుతం ఆక్వారంగం బాగా విస్తరిస్తోందని, ఆక్వా రంగంలో వినియోగించే కొన్నింటిపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించిందని గుడివాడ కమర్షియల్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్–2 రంగమణి అన్నారు. స్థానిక పెడన మార్కెట్‌కమిటీ సమావేశం హాలులో ఆక్వా రైతులకు జీఎస్టీపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రంగమణి మాట్లాడుతూ ఫిష్ అయిల్‌తో పాటు ఆక్వా చెరువుల్లో వినియోగించే పలు యంత్ర పరికరాలపై కూడా జీఎస్టీ తగ్గిందన్నారు. తగ్గింపు ధరలను తెలుసుకునే విధానాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో బంటుమిల్లి మత్స్యశాఖ ఏడీ సీతారామాంజనేయులు, బంటుమిల్లి ఎఫ్‌డీవో వి.సాయికృష్ణ, ఎంపీడీవో కార్యాలయం ఏవో శివకుమార్, ఆక్వా రైతులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు అవగాహన కల్పించాలి

ఘంటసాల: క్షేత్రస్థాయిలో ప్రజలకు అర్థమయ్యేలా జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పించాలని అవనిగడ్డ నియోజకవర్గ ప్రత్యేకాధికారి పి.సాయిబాబు అన్నారు. ఘంటసాల సచివాలయ ప్రాంగణంలో కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు ప్రచారం కల్పించే అంశంపై పంచాయతీ కార్యదర్శులు, ఇతర శాఖల అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడంతో నిత్యావసరాలు, ఇతర వస్తువుల ధరలు తగ్గాయన్నారు. దీనిపై ప్రచారం కల్పించాలని అధికారులకు సూచించారు. మండల జీఎస్టీ ప్రత్యేకాధికారి సర్దార్ పాషా మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కరపత్రాలు పంపిణీ చేయడంతో పాటు ర్యాలీలు నిర్వహించాలన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీవో కేజే శ్రీనివాస చంద్, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు, షాపుల యజమానులు పాల్గొన్నారు.

చిలకలపూడి రోడ్డులో వే బ్రిడ్జిని వినియోగంలోకి తీసుకురావాలి



పీఏసీఎస్ చైర్‌పర్సన్ పరాత్పరరావును సత్కరిస్తున్న కమిటీ సభ్యులు, రైతులు

ఘంటసాల: చిలకలపూడి రోడ్డులో నిరుపయోగంగా ఉన్న వే బ్రిడ్జిని వినియోగంలోకి తీసుకురావాలని పలువురు రైతులు పీఏసీఎస్ త్రిమెన్ కమిటీ సభ్యులను కోరారు. ఘంటసాల గ్రామంలోని జల. దీశ్వర పీఏసీఎస్ సర్వ సభ్య సమావేశం చైర్‌పర్సన్ బండి పరాత్పరరావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు ఘంటసాల గ్రామంలోని చిలకలపూడి రోడ్డులో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన వేబ్రిడ్జి నిరుపయోగంగా ఉందని, దానిని కోఆపరేటివ్ అధికారులతో మాట్లాడి ఉపయోగంలోకి తీసుకురావాలని కోరారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వేబ్రిడ్జి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన చెప్పారు. నూతనంగా ఏర్పడిన కమిటీ రైతుల సహకారంతో పీఏసీఎస్‌ను అభివృద్ధి చేస్తూ వారి సంక్షేమానికి తమవంతు కృషి చేస్తామన్నారు. పీఏసీఎస్ కార్యదర్శి కొణతం రామకృష్ణ పీఏసీఎస్ ద్వారా రైతులకు అందించిన రుణాలు, ఖర్చులు, బ్యాంకు లావాదేవీలను వివరించారు. అనంతరం త్రి మెన్ కమిటీ మొదటి సమావేశం సందర్భంగా చైర్‌పర్సన్ పరాత్పరరావును కమిటీ డైరెక్టర్లు రాజులపాటి వీరాచారి, దాసరి సీతారామాంజనేయ ప్రసాద్‌లు సత్కరించారు. శ్రీకాకుళం డీసీ చైర్మన్ అయినపూడి భానుప్రకాష్, వేమూరి ప్రవీణ్, గొర్రెపాటి గోపాలకృష్ణ, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి రామకృష్ణ, గొర్రెపాటి చంటిబాబు, అయినపూడి విజయ్ కుమార్, కాకుమాని రంగారావు, సొసైటీ పరిధిలోని రైతులు పాల్గొన్నారు.

కృష్ణానదికి స్వల్పంగా తగ్గిన వరద

శ్రీకాకుళం(ఘంటసాల): వరద ఉధృతి తగ్గే వరకు అధికారులు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ ఆదేశించారు. ఘంటసాల మండలంలోని శ్రీకాకుళం, పాపవినాశనం గ్రామాల పరిధిలోని వరద ఉధృతిని మంగళవారం తహసీల్దార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల వద్ద వరద ఉధృతి కొంత మేర తగ్గినా మరలా పెరిగే అవకాశం ఉన్నందున అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. వరద పూర్తి స్థాయిలో తగ్గే వరకు ప్రజలు, పశువుల కాపరులు, రైతులు కరకట్ట దిగువకు వెళ్లకుండా చూడాలని, ప్రజలు కూడా అధికారులకు సహకరించి సూచనలు పాటించాలని తహసీల్దార్ కోరారు. శ్రీకాకుళం ఇసుక క్వారీ ర్యాంపుపైకి వచ్చిన వరద నీరు కొద్దిమేర వెనక్కు తగ్గింది.

ఆహ్లాదంగా కోలాటం పోటీలు



చిట్టూర్పు(ఘంటసాల): చిట్టూర్పు గ్రామంలోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం ప్రాంగణంలో జరుగుతున్న కృష్ణా, ఎన్టీఆర్, నెల్లూరు జిల్లాల స్థాయి మురళీ కోలాటం పోటీలు మంగళవారం ఆహ్లాద వాతావరణంలో పోటా పోటీగా సాగాయి. ఈ వివిధ ప్రాంతాల నుంచి మూడు మురళీ కోలాటం బృందాలు పాల్గొనగా కోసూరివారిపాలెం గ్రామానికి చెందిన శ్రీ అనంత కోటి మురళీ కోలాట సమాజం అద్భుతమైన ప్రదర్శన చేసి భక్తుల, ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. అలాగే తాళం భజన పోటీలు కొనసాగుతున్నాయి. కొడాలి పీఏసీఎస్ చైర్‌పర్సన్ గుత్తికొండ ప్రసాద్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా పడుగు ప్రభాకర్, పి.శ్రీనివాసరావులు వ్యవహరించారు. కార్యక్రమంలో దాసరి సతీష్, యలవర్తి వంశీ, వేములపల్లి సుధీర్, పరుచూరి వెంకటేశ్వరరావు, వాకా రాకేష్, గుత్తికొండ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్య పంటల వివరాలు నమోదు చేయాలి



బొబ్బర్లంకలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, అధికారులు



పల్లెపాలెంలో పర్యటిస్తున్న సర్పంచ్ విజయకుమార్ తదితరులు

బొబ్బర్లంక(మోపిదేవి): వాణిజ్య పంటల వివరాలు నమోదు చేయాలని అవనిగడ్డ శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్ అధికారులకు సూచించారు. మండల పరిధిలోని బొబ్బర్లంక, కె కొత్తపాలెం గ్రామాల్లోని ముంపు ప్రాంతాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పల్లపు ప్రాంతాల్లో ముంపుకు గురైన అరటి, పసుపు, బంతి తోటలను ఆయన పరిశీలించారు. రైతుల వద్ద నుంచి పంటల వివరాలు సేకరించి నివేదిక రూపొందించాలని ఉద్యానవనశాఖ అధికారి ఎస్.రమేష్‌ను ఆదేశించారు. అనంతరం కె.కొత్తపాలెం ఎస్సీ కాలనీలో నీట మునగిన ఇళ్లను పరిశీలించి, సహాయక చర్యలు వేగవంతం చేయాలన్నారు. నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్, దొప్పలపూడి జగదీష్, పీఏసీఎస్ చైర్మన్ పూషడపు రత్నగోపాల్, మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు చందన రంగారావు, వీఆర్వో ఓగిరాల నాగమల్లేశ్వరావు, కూటమి నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

అవనిగడ్డ: పులిగడ్డ గ్రామ పంచాయతీ పరిధిలోని వరద ప్రాంతాల్లోని ప్రజలను సర్పంచ్ దాసరి విజయకుమార్ అప్రమత్తం చేశారు. పల్లెపాలెం, రేగులంకలో మంగళవారం సర్పంచ్, ఉపసర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు, పంచాయతీ ఈఓ బి.అనిత పర్యటించారు. వరద ప్రవాహం ఎక్కువగా ఉండటం వల్ల పులిగడ్డ ఎంపీపీ స్కూల్ వద్ద ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రానికి తరలి రావాలని కోరారు. ప్రజలు అధికారుల సూచనలు పాటించాలని చెప్పారు. హెల్త్ డిపార్ట్‌మెంట్ పుష్పదీవెన, ఆశ వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన వారికి సత్కారం



ఉద్యోగాలు సాధించిన వారిని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థుల అసోసియేషన్ సభ్యులు

చల్లపల్లి: స్థానిక శ్రీమంతురాజా యార్లగడ్డ శివరామప్రసాద్ కళాశాలలో చదివి తాజాగా విడుదలైన డీఎస్సీలో ఉపాధ్యాయ పోస్టులు పొందిన పలువురిని కళాశాల పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగాలు సాధించిన కె.ఎల్.సునంద, యడ్ల నాగలక్ష్మి, వై.లెనిన్, బి.రమాంజలి, ఆర్.సీతారామయ్య, ఆర్.మధుబాబులను, ఎస్జీటీగా ఉద్యోగాలు సాధించిన పి.శ్రీనివాసరావులను ఘనంగా సత్కరించారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు తగరిశ సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సభలో రిటైర్డ్ మాజీ ప్రిన్సిపాల్ ఎస్.వి.నరసింహారావు, అధ్యాపకులు సూర్యదేవర నాగేశ్వరరావు పాల్గొన్నారు. తమ వద్ద విద్యాబుద్ధులు నేర్చుకున్న నాటి విద్యార్థులు నేడు ఉపాధ్యాయులుగా భావిభారత పౌరులను తీర్చిదిద్దే గురువులుగా ఎదగటం తమకు ఎంతో గర్వకారణంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు గోవిందరాజుల అశ్విన్‌కుమార్, కొండవీటి నాగరాజు, నడకుదురు లీలాబ్రహ్మేంద్ర, చింతల శ్రీనివాసరావు, సుభాషిణి, దుర్గాప్రసాద్, సీతారామ, పోతురాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

3న సీజ్ చేసిన వాహనాల వేలం

కోనేరుసెంటర్: ఎక్సైజ్ కేసులకు సంబంధించి సీజ్ చేసిన వాహనాలకు ఈ నెల 3వ తేదీ ఉదయం వేలం నిర్వహించనున్నట్లు మచిలీపట్నం ఎక్సైజ్ సీఐ లక్ష్మణరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ కేసులకు సంబంధించి స్టేషన్ పరిధిలో ఐదు ద్విచక్ర వాహనాలకు సీజ్ చేయగా ఎక్సైజ్ డెప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు వేలం నిర్వహిస్తున్నామన్నారు. వేలంలో పాల్గొనే వారు ముందుగా రూ.1000 దరఖాస్తు రుసుంగా చెల్లించాలని చెప్పారు.



ఆకులమన్నాడు పంచాయతీలో ఏర్పాటు చేసిన పసుపు–ఎరుపు రంగుల బెంచీలు

నాడు వద్దు - నేడు ముద్దు

మండల పరిధిలోని ఆకులమన్నాడు పంచాయతీలో ఏర్పాటు చేసిన బెంచీలకు వేసిన రంగుల పట్ల పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బెంచీలకు పసుపు, ఎరుపు రంగులు వేయడం దీనికి కారణం. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో పెద్ద ఎత్తున చేపట్టిన అభివృద్ధి పనులపై అప్పట్లో టీడీపీ, జనసేన పార్టీలు విమర్శలు చేశాయి. కూటమి నాయకులు గతాన్ని మర్చిపోయి బెంచీలకు తమ పార్టీ రంగులు వేసుకోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

– గూడూరు

రుణాలు సకాలంలో చెల్లించి సంఘ అభివృద్ధికి సహకరించాలి



నాగాయతిప్పలో రైతులకు వడ్డీ రాయితీ అందజేస్తున్న చైర్మన్ సీతారామప్రసాద్

నాగాయతిప్ప(మోపిదేవి): సొసైటీలో రైతులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి సంఘ అభివృద్ధికి సహకరించాలని పీఏసీఎస్ చైర్మన్ బల్లా సీతారామప్రసాద్ కోరారు. మండలంలోని నాగాయతిప్ప ప్రాథమిక వ్యవసాయ సహకార పరపత్తి సంఘం వద్ద మంగళవారం మహా జనసభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీలో వ్యవసాయ రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించిన 139 మంది సభ్యులకు రూ.2,13,342లను వడ్డీ రాయితీ అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ సీతారామప్రసాద్ మాట్లాడుతూ.. సొసైటీ పరిధిలోని మోపిదేవిలంక, నాగాయతిప్ప, పోచిగానిలంక గ్రామాల్లోని రైతులు రుణాలకు తమ పాస్‌బుక్‌తో పీఏసీఎస్‌లో సంప్రదించాలని సూచించారు. త్రీ మెన్ కమిటీ సభ్యులు గరికిపాటి రాఘవయ్య, రేపల్లె మునీశ్వరరావు, ఏఎంసీ డైరెక్టర్ పుష్పాల ఏసు, ఇన్‌చార్జి సీఈఓ ఏసయ్య, సంఘ సభ్యులు పాల్గొన్నారు.